సాక్షి రాజన్న సిరిసిల్ల

శుక్రవారం | 11 | జూలై | 2025



బీఎల్‌వోలకు శిక్షణ

బోయినపల్లి: రైతువేదికలో బీఎల్‌వోలకు గురువారం శిక్షణనిచ్చారు. తహసీల్దార్ నారాయణరెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.



మహిళాశక్తి సంబురాలు

గంభీరావుపేట: గతేడాది సాధించిన ప్రగతిని వివరిస్తూ మహిళా శక్తి సంబురాలు మండలంలో నిర్వహిస్తున్నారు. మండలకేంద్రంలో గురువారం కళాజాత ప్రదర్శన నిర్వహించారు.



వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

రహీంఖాన్‌పేటలో స్వచ్ఛ సర్వేక్షన్ బృందం



ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని రహీంఖాన్‌పేటలో గురువారం స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్ కేంద్ర బృందం పర్యటించింది. గ్రామంలో ప్రతీ ఇంటికి వెళ్లి ఇంకుడుగుంత, కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. ప్రైమరీ స్కూల్ వద్ద రోడ్డుపై పారుతున్న మురికినీటిని చూసి వెంటనే పనులు చేపట్టాలని సెక్రటరీకి సూచించారు. గ్రామంలోని కంపోస్ట్‌షెడ్డు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ మెంబర్ అనూష, స్వచ్ఛభారత్ మిషన్ మెంబర్ సురేష్, ఎంపీడీవో శశికళ, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి సంధ్య, ఏఎస్‌ఎం స్వరూప, చెర్ల శ్రీనివాస్, అంగన్‌వాడీలు స్వప్న, ఐలవ్వ, సీఏ పద్మ పాల్గొన్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): మద్దికుంటలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేను గురువారం చేపట్టారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ 2025లో భాగంగా మద్దికుంటలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆలయం, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్ శిరీష సర్వే చేశారు. ఎస్‌బీఎం అసిస్టెంట్ ప్రేమ్, ఎంపీడీవో బీరయ్య, ఏపీఎం మోహన్ పాల్గొన్నారు.

ప్రతి ఓటరునూ నమోదు చేయాలి

సిరిసిల్ల: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటర్లుగా నమోదు చేయాలని, మరణించిన ఓటర్లను నిబంధనల మేరకు తొలగించాలని సిరిసిల్ల ఆర్డీవో సీహెచ్ వెంకటేశ్వర్లు సూచించారు. సిరిసిల్ల పద్మనాయక కల్యాణ మండపంలో గురువారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఆర్డీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితాను ఆధునీకరించాలని, తప్పులు లేని జాబితాను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతులు కల్పనను పరిశీలించాలని అధికారులకు సూచించారు. సిరిసిల్ల తహసీల్దార్ మహేశ్, డిప్యూటీ తహసీల్దార్లు కె.భాస్కర్‌రెడ్డి, అశోక్, మాస్టర్ ట్రైనర్ పాతూరి మహేందర్‌రెడ్డి, ఆరు మండలాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువులే కీలకం



సిరిసిల్లఅర్బన్: సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర అత్యంత కీలకమని వారిని సన్మానించుకోవడం మన బాధ్యత అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి పేర్కొన్నారు. సిరిసిల్లలోని బీజేపీ ఆఫీస్‌లో పార్టీ పట్టణాధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా వివిధ రంగాల్లో గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని సన్మానించారు. సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, బీజేపీ సీనియర్ నాయకులు గరిపెల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సిరిసిల్లకల్చరల్: చదువుకునే దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ పేర్కొన్నారు. అనంతనగర్‌లోని సాయిశ్రీ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. చట్టాలపై అవగాహన లేక జీవితంలో నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీనియర్ న్యాయవాది చెక్కిళ్ల మహేశ్‌గౌడ్ పోక్సో చట్టం గురించి వివరించారు. న్యాయవాది గెంట్యాల భూమేశ్, కళాశాల కరస్పాండెంట్ చొటపెల్లి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మేడిచెలిమెల తిరుపతి మాట్లాడారు.

వర్షం జల్లులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా గురువారం వర్షం జల్లులు కురిశాయి. అత్యధికంగా తంగళ్లపల్లిలో 16.3 మిల్లీమీటర్లు, రుద్రంగిలో 3.8, చందుర్తిలో 5.2, వేములవాడరూరల్‌లో 7.4, బోయినపల్లిలో 3.5, వేములవాడలో 11.5, సిరిసిల్లలో 8.6, కోనరావుపేటలో 8.5, వీర్నపల్లిలో 9.8, ఎల్లారెడ్డిపేటలో 15.1, గంభీరావుపేటలో 6.0, ముస్తాబాద్‌లో 2.6, ఇల్లంతకుంటలో 13.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ప్రభంజనం

- ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా
- జననాలు పెరుగుతుండగా తగ్గుతున్న మరణాలు
- భయపెడుతున్న పట్టణీకరణ సమస్య
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి,పెద్దపల్లి:

దేశ ప్రగతికి, పతనానికి ప్రధాన కారణమైన జనాభా ఇప్పుడు ప్రపంచాన్నే భయపెడుతున్న అతిపెద్ద సమస్య. జనాభా తగ్గుదలపై ప్రభుత్వాలు ఆందోళన చెందుతుండగా, మారిన జీవనశైలితో పిల్లలను కనేందుకు ఆసక్తిచూపని దంపతుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ఇకపై వద్దంటూ ఒకప్పుడు ప్రభుత్వాలే ముమ్మరంగా ప్రచారం చేయగా, నేడు వీలైనంత మందిని కనండని ప్రభుత్వాలే వేడుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో జనాభా పెరుగుదల కనిపిస్తుండగా, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గాయి. పెరిగిన జనాభా విద్య, ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వలసపోతుండడంతో పల్లె చిన్నబోతుంది. పంట పొలాలు కనుమరుగై ఆకాశ హర్మ్యాలు వెలుస్తున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌తో సహా జిల్లా కేంద్రాలుగా మారిన మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా మారుతుండటం పట్టణాలకు వలస పోతున్న జనాభాకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నియంత్రణతో అడ్డుకట్ట

జనాభా పెరుగుదల అభివృద్ధికి ఆటంకమన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేసింది. అయినా 1952 నుంచి 1975 ఎమెర్జెన్సీ కాలం వరకు విపరీతంగా పెరిగింది. ఎమెర్జెన్సీ తర్వాత 1976లో ప్రకటించిన జాతీయ జనాభా విధానం అనుగుణంగా వివాహ వయస్సు పెంచడం, ఆర్థిక ప్రోత్సాహకాలు, మహిళ అక్షరాస్యత పెంపుతో జనాభా తగ్గుదల నమోదైంది. అయితే ఇటీవల కరోనా సమయం అనంతరం జనాభా స్థిరీకరణపై ప్రభుత్వాలు దృష్టిసారించాయి.

పట్టణీకరణే ప్రధాన సమస్య

జిల్లాల విస్తరణ, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం కోరుతూ ప్రజలు నగరం బాట పడుతున్నారు. కొత్త జిల్లాలుగా ఏర్పడిన పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల కేంద్రాల్లోనూ పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. ప్రభుత్వ వైద్యం, విద్య సదుపాయాలను మెరుగుపరుస్తుండడం, కొత్త కట్టడాల నిర్మాణం పెరుగుతుండడంతో వివిధ వర్గాలకు ఉపాధి లభిస్తోంది. దీంతో ఆయా




కేంద్రాల్లో జనాభా పెరుగుదల కనిపిస్తోంది. దీంతో మున్సిపాలిటీల్లో జనాభా ఒత్తిడి పెరుగుతుంది. ఆయా జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడం సవాలుగా మారుతుంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపిస్తేనే సమస్యలు తీరనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో పెరిగిన జనాభా..

పట్టణం	1991	2001	2011
కరీంనగర్	1,48,583	2,05,653	2,61,185
జగిత్యాల	67,591	85,521	96,460
రామగుండం	2,14,384	2,36,600	2,58,644
సిరిసిల్ల	50,048	65,314	77,550
కోరుట్ల	40,080	54,012	66,504

పెరిగిన జననాలు

జనన, మరణాలను అధికారికంగా నమోదు చేసే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం–2021 నివేదిక ఆధారంగా 2021లో జిల్లాలో నమోదైన జననాలను విడుదల చేసింది. ఈ నివేదిక ఆధారంగా చూస్తే 43,345 జనాలు ఉండగా, మరణాలు 26,757 నమోదయ్యాయి. మెడికల్ వసతులు పెరగడం కారణంగా తెలుస్తోంది.



సీఆర్‌ఎస్-2021 నివేదిక ప్రకారం జననాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	11,726	10,063	21,789
పెద్దపల్లి	4,834	4,538	9,372
జగిత్యాల	6,134	6,050	12,184
సిరిసిల్ల	2,690	2,338	5,028

సీఆర్‌ఎస్- 2021 నివేదిక ప్రకారం మరణాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	5,353	3,138	8,491
పెద్దపల్లి	3,984	2,582	6,566
జగిత్యాల	3,995	2,575	6,570
సిరిసిల్ల	3,027	2,103	5,130

2011 ప్రకారం జనాభా

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం
జగిత్యాల	4,85,819	5,03,094	9,88,913
పెద్దపల్లి	3,97,585	3,94,251	7,91,836
కరీంనగర్	5,04,620	5,01,091	10,05,711
సిరిసిల్ల	2,74,109	2,77,928	5,52,037

గ్రామీణ, పట్టణ జనాభా జిల్లాల వారీగా

జిల్లా	గ్రామీణం	పట్టణం
జగిత్యాల	7,67,577	2,21,336
పెద్దపల్లి	4,87,823	3,04,013
కరీంనగర్	6,96,727	3,08,984
సిరిసిల్ల	4,35,145	1,16,892

లింగ నిష్పత్తి

జిల్లా	మొత్తం జనాభా పరంగా	ఆరేళ్ల పిల్లల జనాభా పరంగా
జగిత్యాల	1,036	947
పెద్దపల్లి	992	922
కరీంనగర్	993	931
సిరిసిల్ల	1,014	942

ఆరేళ్ల లోపు పిల్లల జనాభా (2011 జనాభా ప్రకారం)

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
జగిత్యాల	48,048	45,523	93,571
పెద్దపల్లి	34,614	31,899	66,513
కరీంనగర్	46,124	42,955	89,079
సిరిసిల్ల	25,099	23,652	48,751

ఒక్కరే చాలనుకున్నాం



ఇల్లంతకుంట: నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. భార్య మంజుల గృహిణి. కూతురు సౌమ్య రెడ్డి బీటెక్ చదివి సాఫ్ట్‌వేర్‌గా స్థిరపడింది. ఇద్దరు పిల్లలు అయితే ప్రస్తుత పరిస్థితుల్లో నాణ్యమైన విద్య అందించడం సాధ్యం కాదనుకున్నం. పాప పుట్టగానే ఫ్యామిలీ ప్లానింగ్ చేయించుకున్నాం.

– సింగిరెడ్డి జలంధర్‌రెడ్డి, గాలిపల్లి

కొడుకైనా..కూతురైనా ఒక్కరే



సిరిసిల్ల అర్బన్: నా భార్య పేరు వనజ. సంజీవయ్య నగర్‌లో కారు రిపేరింగ్ షెడ్డు నిర్వహిస్తాను. మాకు ఒకే కూతురు సాత్విక. కొడుకైనా, కూతురైనా ఒక్కరే చాలనుకున్నాం. ఆమెను ఉన్నతంగా చదివించాలని కష్టపడుతున్నాం. సివిల్స్‌కు ప్రిపేరవుతుంది. ఉన్నతాధికారిగా చూడడమే మా కోరిక. – కూతురు సాత్వికతో వెంకటేశం–వనజ

కూతురును ఉన్నతంగా చదివించాం



ఎల్లారెడ్డిపేట: నా భార్య పద్మ అంగన్‌వాడీ టీచర్. నేను గల్ఫ్ వెళ్లి వచ్చాను. ఒక్కరే సంతానం చాలనుకున్నాం. కూతురు సాహితి పుట్టగానే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాం. చిన్న కుటుంబం చింతలు లేకుండా ఉండవచ్చని భావించే ఈ నిర్ణయం తీసుకున్నాం. కూతురును ఎంబీఏ వరకు చదివించి పెళ్లి చేశాం.

– మార్పు దామోదర్, రాచర్లబొప్పాపూర్

బాలకార్మికులు లేకుండా చూడాలి

- ఆపరేషన్ ముస్కాన్‌పై దిశ నిర్దేశం
- ఎస్పీ మహేశ్ బి గీతే



మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బీ గీతే

సిరిసిల్లక్రైం: జిల్లాలో బాలకార్మికులు లేకుండా చేయడమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బీ గీతే పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో బాధ్యతగా పనిచేయాలన్నారు. బాలకార్మికులను బడిలో చేర్పించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్‌పై పోలీస్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. గత 10 రోజుల్లో 31 మంది పిల్లలను సీడబ్ల్యూసీ ముందు హాజరుపరచగా తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చెప్పారు. మైనర్లతో పనిచేయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. పరిశ్రమలు, హోటళ్లు, వ్యాపార సముదాయాలలో తనిఖీలు చేయాలన్నారు. సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, సీఎంసీ చైర్‌పర్సన్ అంజయ్య, సీఐ నాగేశ్వరరావు, ఎస్సై లింబాద్రి, లక్ష్మి, అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ అహ్మద్, మెడికల్ అండ్ హెల్త్ బాధ్యులు నయీమ్ జహార్, విద్యాశాఖ బాధ్యులు శైలజ, ఏఎస్సై ప్రమీల, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ రోజా పాల్గొన్నారు.

గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

- జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ఎస్.రజిత

సిరిసిల్ల: జిల్లాలోని గర్భిణుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ఎస్.రజిత కోరారు. కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆఫీస్‌లో గురువారం పీహెచ్‌సీల వైద్యులు, ఆస్పత్రుల పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో రజిత మాట్లాడుతూ ఎంసీహెచ్‌లో భాగంగా ప్రతీ గర్భిణి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో విధిగా నమోదు చేయాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, వెంటనే ఇంటికి పంపించకుండా అబ్జర్వేషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే నిర్వహించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎంజెలినా ఆల్ఫ్రెడ్, వైద్యులు సంపత్, రామకృష్ణ, అనిత, నయిమా జహా పాల్గొన్నారు.

పోస్టాఫీస్.. చిరునామా ఎక్కడో?!



భగవంతరావునగర్‌లోని పోస్టాఫీస్



పోస్టాఫీస్ భవనం కోసం కేటాయించిన స్థలం

- ఖాళీగానే ప్రభుత్వ స్థలం
- సిబ్బంది కొరతతో ఇబ్బంది

వేములవాడరూరల్: పట్టణంలోని పోస్టాఫీస్ ఎక్కడ ఉందో పట్టణ ప్రజలకు తెలియడం లేదు. మొన్నటి వరకు రాజరాజేశ్వరస్వామి వసతిగదులైన పార్వతీపురంలో ఉన్న ఈ పోస్టాఫీస్‌ను భగవంతరావునగర్‌కు మార్చారు. ఈ చిరునామా తెలియక తికమక పడుతున్నారు. 2012లో అప్పటి ఎంపీ పొన్నం ప్రభాకర్ రైల్వే బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం సిబ్బంది కొరతతో ఈ సేవలు కూడా అందడం లేదు. పోలీస్‌స్టేషన్ ఎదురుగా టెలిఫోన్ ఆఫీస్ వెనుక భాగంలో దాదాపు 11 గుంటల స్థలాన్ని గతంలోనే పోస్టాఫీస్ కోసం కేటాయించారు. నిధులు రాకపోవడంతో భవనం నిర్మించడం లేదు. దీంతో ఏళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది.

అమ్మకో మొక్క


- ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి
- తహసీల్దార్ ముక్తార్ పాషా



వీర్నపల్లి(సిరిసిల్ల): సందర్భం ఏదైనా.. స్థలం ఎక్కడున్నా ప్రతి ఒక్కరూ అమ్మ కోసం ఒక మొక్కను నాటాలని తహసీల్దార్ ముక్తార్‌పాషా, చందుర్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ ఖలీలుద్దీన్ కోరారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనమహోత్సవంలో గురువారం వీర్నపల్లి, రంగంపేట, గర్జనపల్లి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటాలి. విద్యార్థులు భవిష్యత్ తరాల సంక్షేమం కోసం విరివిగా మొక్కలు నాటాలని కోరారు. గర్జనపల్లి హెచ్‌ఎం వెంగళ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములునాయక్, సెక్షన్ అధికారులు సక్కారామ్, రంజిత్‌కుమార్, పద్మలత, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ రాకేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు బలరాం, మంజుల, శ్రీనివాస్, కవిత పాల్గొన్నారు.

ఎక్సైజ్ నేరాల నియంత్రణకు సహకరించాలి

- జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రావు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో ఎక్సైజ్ నేరాల నియంత్రణకు ప్రజలు సహకరించాలని, యువత గంజాయి, గుడుంబాకు దూరంగా ఉండాలని జిల్లా ఎక్సైజ్ అధికారి పి.శ్రీనివాస్‌రావు కోరారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో వివిధ నేరాలలో పట్టుబడ్డ వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఏడు వాహనాలను అధికారులు పట్టుకోగా, నాలుగు వాహనాలకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి రూ.1,19,652 ఆదాయం వచ్చింది. సీఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



చేప ముక్క వడ్డిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్లఅర్బన్: మత్స్యకారులు చేపల పెంపకంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతువేదికలో నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ మత్స్యరైతుల వేడుకలు నిర్వహించారు. విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ చెరువుల్లోకి సకాలంలో చేపల పంపిణీ చేపడతామని తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూనే కొత్త పథకాలను అమలు చేస్తున్నామన్నారు. తాము ఎమ్మెల్యేగా గెలిచిన మూడు నెలల్లోనే కథలాపూర్ మండలంలో తెగిపోయిన చెరువులను మరమ్మతులు చేయించామని, మల్కపేట రిజర్వాయర్‌ను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలు కేజీకల్చర్‌లో చేపల పెంపకానికి ముందుకురావాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, జిల్లా ఫిషరీష్ చైర్మన్ చొప్పరి రామచంద్రం, డీఏవో అఫ్జల్‌బేగం, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సునీల్‌కుమార్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



ఆరా తీస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ముస్తాబాద్(సిరిసిల్ల): నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా హెచ్చరించారు. మండలంలోని శ్రీనివాస్ ఎరువులు– విత్తనాలు, కోరమండల్ మన గ్రోమోర్ విక్రయ దుకాణాలను, గోదాములను, ఆవునూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. కోరమండల్ మన గ్రోమోర్ గోదాంలో యూరియా స్టాక్ లేనట్లు గుర్తించి నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, ఏవో దుర్గరాజు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయం గురుపౌర్ణమిని పురస్కరించుకొని గురువారం కిక్కిరిసింది. సాయిబాబాను దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. బీవైనగర్ హనుమాన్, శివసాయిబాబా, పెద్దబజారు హనుమాన్ ఆలయాల్లో సామూహిక సత్యనారాయణవ్రతాలు, గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

శేఖర్‌రావుకు డాక్టరేట్ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శేఖర్‌రావు

కరీంనగర్: 30 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాడుతూ సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి కృషి చేసిన వ్యక్తిగా, కరోనా కాలం నుంచి వారు చేస్తున్న సేవలను గుర్తించి హోప్ థియోలాజికల్ యూనివర్సిటీ వారు ప్రముఖ విద్యావేత్త, ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రజ్ఞా వికాస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావుకు గురువారం డాక్టరేట్ పురస్కారం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఆ పాఠశాలలో పని చేసే బోధన, బోధనేతర సిబ్బందికి కరోనా సమయంలో యాజమాన్యాల సహకారంతో ఎంతోకాలం నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వడంలో కూడా సఫలీకృతులయ్యారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడి ఆత్మహత్య



శ్రీకాంత్ (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): ఉద్యోగం రావడం లేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్మాలలో గురువారం జరిగింది. నర్మాలకు చెందిన లోకం శ్రీకాంత్(25) హైదరాబాద్‌లో ఉద్యోగాల కోసం వెతుకుతున్నాడు. రెండు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి వచ్చి గ్రామ శివారులోని వరి పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి మణెమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

ఓ వైపు భయం.. మరో వైపు దావత్‌లు

- స్కైలాబ్ ఉపగ్రహం నేలకూలి 46 ఏళ్లు
- జ్ఞాపకాల యాదిలో అప్పటి తరం



చొప్పదండి: స్కైలాబ్ ఉప గ్రహం

చొప్పదండి: ఉపద్రవం ముంచుకొస్తోందని ఒకవైపు ఆందోళన, ఎలాగూ మరణిస్తున్నామనే భావనలో జల్సాలు చేసుకోవడం మరోవైపు వెరసి, జన జీవనాన్ని అతలాకుతలం చేసిన 'స్కైలాబ్' ఘటనకు 46 ఏళ్లు నిండాయి. స్కైలాబ్ అనే ఉపగ్రహం దారితప్పి భూమండలంపై కూలిపోతోందని, అది దేశంలో పడితే మరణాలు తప్పవనే ప్రచారంతో 1979 జూలైలో అప్పటి జన జీవనమే అదుపుతప్పింది. శాస్త్రవేత్తలు ప్రయోగించిన ఉప గ్రహమైన స్కైలాబ్ కూలిపోతుందని అప్పట్లో రేడియోలలో ప్రచారం జరిగింది. దీంతో ధనిక, పేద లేకుండా గ్రామాల్లో భయాందోళనలతో గడిపారు. మేకలు, కోళ్లు, గొర్రెలను కోసుకొని తిని ఎలాగు చనిపోతున్నామని పండుగ చేసుకున్నారు. తమకున్న వస్తువులను తక్కువ ధరలకే అమ్ముకుని మరీ జల్సాలు చేశారు. శాస్త్రవేత్తలు ఎట్టకేలకు స్కైలాబ్‌ను సముద్రంలో కుప్పకూల్చేలా విజయం సాధించారు. ఉపగ్రహంతో ఉపద్రవం లేదనే రేడియో వార్తలు రావడంతో మళ్లీ కొద్ది రోజుల పాటు ప్రజలు ఉత్సవాలు జరుపుకున్నారు. స్కైలాబ్ సముద్ర మట్టమైన రోజు పుట్టిన పిల్లలకు గుర్తుగా అదేపేరు పెట్టడం గమనార్హం. జూలై 11కు స్కైలాబ్ పడి 46 ఏళ్లు గడిచినా అప్పటి జ్ఞాపకాలు మాత్రం పలువురి మదిలో ఇంకా పదిలంగానే ఉన్నాయి.

భయపెట్టిన్రు



ఉపగ్రహం పడుతోందని చెప్పినప్పుడు నాకు ప్రెగ్నెన్సీ ఉంది. అప్పుడు రేడియో వార్తలు వినేటోళ్లం. అందరూ కోళ్లు, గొర్రెలు కోసుకొని తినుకుంటనే.. చనిపోతమని భయపడేటోళ్లు. జూలై 11న ఉపగ్రహం గండం గడిచిందని వార్త వచ్చిన రోజు నాకు కొడుకు పుట్టిండు. కొడుకు పుట్టిండు, అందరిని బతికించిండు అని అందరూ సంబర పడ్డరు.

– కందుల చంద్రమ్మ, మంగళపల్లి

పేరులో ప్రత్యేకత ఉంది



స్కైలాబ్ ఉపగ్రహం సముద్రంలో పడిపోయి గండం గడిచిపోయిన రోజు నేను పుట్టానట. దాంతో మా అమ్మానాన్న, మేనమామలు నా పేరు స్కైలాబ్ అని పెట్టడంతో, ఊహ తెలిశాక పేరులో ప్రత్యేకత ఉందని అర్థమైంది. నా పేరు వినగానే అప్పటి తరానికి ఆ పేరు ఎందుకు పెట్టారో అర్థం అవుతుంది.

– స్కైలాబ్ గౌడ్, చొప్పదండి

రేపటి నుంచి ఆల్ ఇండియా చెస్ టోర్నీ

- హాజరుకానున్న 1000 మంది క్రీడాకారులు
- జీసీయస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్



వివరాలు వెల్లడిస్తున్న అనూప్ కుమార్

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ వేదికగా జీసీయస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో 3వ ఆల్ ఇండియా చెస్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పోటీల వివరాలు వెల్లడించారు. ఈ నెల 12,13 తేదీల్లో కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరుకానున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఉచిత వసతి భోజన, సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు పోటీలను స్విస్ లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నామని తెలిపారు. విజేతలకు సుమారు రూ.లక్షకు పైగా నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జీసీయస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనుకయ్య, కో ఆర్డినేటర్లు సృజన్‌కుమార్, సతీశ్ బాబు, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఆడెపు శ్రీనివాస్, జిల్లా ప్రైవేటు వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష కార్యదర్శులు బత్తిని శ్రీధర్‌గౌడ్, దారం శ్రీనివాస్‌రెడ్డి, శివకృష్ణ, మైపాల్, రమ్య పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు



ఆరెపల్లిలో కూల్చివేసిన షెడ్డు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో అక్రమ నిర్మాణాలపై నగరపాలకసంస్థ దృష్టి సారించింది. కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అనుమతి లేని నిర్మాణాలపై చర్యలకు పూనుకున్నారు. అందిన ఫిర్యాదుల మేరకు నగరంలోని పలు అక్రమ నిర్మాణాలను తొలగించిన అధికారులు, గురువారం మరో రెండు కూల్చివేతలు చేపట్టారు. ఆరెపల్లిలో రోడ్డును ఆక్రమించి చేపట్టిన ప్రహరి, షెడ్‌ను జేసీబీతో తొలగించారు. బ్యాంక్‌కాలనీలో డెడ్‌ఎండ్ స్ట్రీట్‌లో వేసిన టిన్‌షెడ్‌ను తొలగించారు. పట్టణ ప్రణాళిక విభాగం ఇన్‌చార్జి డీసీపీ బషీర్, ఏసీపీలు వేణు, శ్రీధర్, టీపీఎస్‌లు తేజస్విని, సంధ్య పాల్గొన్నారు.

5 ట్రాక్టర్లు, జేసీబీ పట్టివేత

సిరిసిల్లక్రైం: నిబంధనలు అతిక్రమించి అక్రమంగా మట్టిని తవ్వి సరఫరా చేస్తున్న వాహనాలను జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐ నటేశ్ తెలిపిన వివరాలు. ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి శివారులో నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారన్న సమాచారంతో ఎస్పీ ఆదేశాలతో దాడులు చేశారు. ఐదు ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు.

ఫైనాన్స్ కార్యాలయాలపై పోలీసుల దాడులు

- 10 మందిపై కేసు.. రూ.60 లక్షల పత్రాలు స్వాధీనం



సోదాలు చేస్తున్న పోలీసులు

సిరిసిల్లక్రైం/ఇల్లంతకుంట/ఎల్లారెడ్డిపేట: రాజన్నసిరిసిల్ల జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆఫీస్‌లు, ఇళ్లపై జిల్లా పోలీసులు గురువారం దాడులు చేశారు. 20 బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్న పది మందిపై కేసులు నమోదు కాగా రూ.60లక్షల విలువైన పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మహేశ్ బీ గీతే తెలిపారు. అప్పు ఇవ్వడానికి తాకట్టు పెట్టుకున్న నాలుగు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతితో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలని, అనుమతి లేకున్నా అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం నడిపే వారి వివరాలు తెలపాలని కోరారు. సిరిసిల్లకు చెందిన నల్ల ప్రదీప్, దూస శ్రీనివాస్, దుబాల మొండయ్య, ఉషాకోయిలా మనోహర్, ఎనగందుల శ్రీహరి, ఒడ్నాల ఆంజనేయులు, బోయినపల్లికి చెందిన మేడిశెట్టి పురుషోత్తం, తాళ్లపల్లికి చెందిన గొర్ల రాములు, మల్లారెడ్డిపేటకు చెందిన బొందుగుల జగదీశ్వర్, దండవేని అశోక్‌లపై కేసులు నమోదు చేశారు.

చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి బంగారు చైన్ దొంగలించిన ఇద్దరుని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ జాన్‌రెడ్డి వెల్లడించారు. ఈయన కథనం ప్రకారం.. నగరంలోని మారుతినగర్‌కు చెందిన స్వరూప ఇంట్లో నిద్రిస్తోంది. బుధవారం వేకువజామున నగరానికి చెందిన చింతకింద సదాశివ, టేకుమల్ల నాగరాజు మహిళ ఇంట్లోకి ప్రవేశించి, ఆమె మెడలోంచి 42 గ్రాముల బంగారు గొలుసు అపహరించారు. మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన త్రీటౌన్ పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. నాగరాజును గర్రెపల్లి సమీపంలో, సదాశివను హౌజింగ్‌బోర్డుకాలనీలో అరెస్టు చేసి, చైన్, బైకు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ఇంట్లో ఒంటరిగా నివసించే మహిళలు అప్రమత్తంగా ఉండాలని సీపీ గౌస్ ఆలం సూచించారు. మారుతినగర్‌లో ఒంటరిగా నిద్రిస్తున్న మహిళ మెడలోంచి దుండగులు బంగారం చోరీచేసిన ఘటనను గుర్తుచేశారు. ఊర్లెళ్లేవారు ఇంట్లోని బంగారు ఆభరణాలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని లేదా సురక్షితంగా దాచుకోవాలని సూచించారు. ఇంటి ప్రధాన ద్వారానికి సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎటైనా వెళ్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పిచ్చికుక్కల దాడిలో 12 మందికి గాయాలు



గాయపడ్డ బ్రహ్మచారి



గాయపడ్డ లక్ష్మీరాజం చికిత్స చేస్తున్న సిబ్బంది

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండల కేంద్రంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చందుర్తిలో గురువారం 12 మందిపై దాడి చేయగా ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. చందుర్తికి చెందిన పోతురాజు తిరుపతి, పోంశెట్టి లక్ష్మి, జైనబీ, భారతి, మర్రి మల్లయ్య, ఎన్నం రవి, వై.రామయ్య, ఆశిరెడ్డిపల్లికి చెందిన భసూరి బ్రహ్మచారి, మల్యాలకు చెందిన ఎన్.శేషాద్రి, రామన్నపేటకు చెందిన లక్ష్మీరాజం, లింగంపేటకు చెందిన తిరుమల మోహినయ్య, కమటం హిమబిందులపై దాడిచేశాయి. జైనబీ, లక్ష్మీరాజం, పోంశెట్టి లక్ష్మి, పోతురాజు తిరుపతి, భసూరి బ్రహ్మచారిలకు తీవ్ర గాయాలు కావడంతో వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చందుర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కుమార్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం
- రేణికుంట వద్ద ఘటన




చెల్లాచెదురుగా మృతదేహాలు

తిమ్మాపూర్: రాజీవ్ రహదారి గురువారం వేకువజామున నెత్తురోడింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులను తిమ్మాపూర్ మండలం రేణికుంట శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకికి చెందిన కోడూరి భానుప్రసాద్(19) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతని స్నేహితుడు, గన్నేరువరం మండలం చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన బామండ్ల నరేశ్(17)తో కలిసి బుధవారం రాత్రి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కరీంనగర్ వెళ్లారు. గురువారం వేకువజామున మూడు గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తున్నారు. రేణికుంట శివారులో రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఇద్దరూ కిందపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఎల్ఎండీ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. భానుప్రసాద్ తల్లి రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోక్సో కేసులో పదేళ్ల జైలు

కరీంనగర్‌క్రైం: బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడైన అక్కినపల్లి వంశీధర్‌కు పదేళ్ల జైలుశిక్ష, రూ.6వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ మొదటి అదనపు జిల్లా జడ్జి వెంకటేశ్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో నివసించే మహిళ కూలీ పని చేసుకుంటూ తన ఇద్దరు కూతుళ్లను చదివిస్తోంది. జూన్ 29, 2020న 9వ తరగతి చదువుతున్న తన రెండో కూతురు కనిపించకపోవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొద్దిరోజుల తరువాత కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చి తల్లికి ఫోన్ చేసింది. తనకు రేకుర్తికి చెందిన ఆటోడ్రైవర్ అక్కినపల్లి వంశీధర్ పరిచయం అయ్యాడని, మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, ఇంటికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని తెలిపింది. పెళ్లి చేసుకోవాలని అడగగా.. అతడికి అంతకుముందే పెళ్లయిందని బెదిరించి కరీంనగర్ బస్‌స్టేషన్‌లో వదిలి వెళ్లాడని సదరు బాలిక తల్లికి వివరించింది. దాంతో బాలిక తల్లి వంశీధర్‌పై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో ఛార్జిషీట్ వేశారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ పంజాల కుమారస్వామి విచారించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన జడ్జి నిందితుడు అక్కినపల్లి వంశీధర్‌కు జైలుశిక్ష, జరిమానా విధించారు.

కరీంనగర్ కోర్టుకు హాజరైన అఘోరి శ్రీనివాస్



కోర్టుకు హాజరైన అనంతరం శ్రీనివాస్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఉమ్మడి రాష్ట్రంలో హల్‌చల్ చేసిన అఘోరి శ్రీనివాస్ గురువారం కరీంనగర్ కోర్టుకు హాజరయ్యాడు. కొత్తపల్లి పోలీసులు పీటీ వారెంటుపై చర్లపల్లి జైలు నుంచి తీసుకొచ్చి కరీంనగర్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసు వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కుషాన్‌పల్లికు చెందిన శ్రీనివాస్‌తో జిల్లాకు చెందిన ఓ మహిళకు నవంబర్ 2024లో పరిచయం ఏర్పడింది. శ్రీనివాస్ తనపై లైంగిక దాడి జరిపాడని, జనవరి 2025లో కొండగట్టు తీసుకెళ్లి తాళికట్టాడని, రూ.3 లక్షలు తీసుకున్నాడని సదరు మహిళ కొత్తపల్లి పోలీసులకు 2025 ఏప్రిల్ 28న ఫిర్యాదు చేసింది. పోలీసులు శ్రీనివాస్‌పై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చర్లపల్లి జైల్లో ఉన్న శ్రీనివాస్‌ను పీటీ వారెంట్ ద్వారా కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. కోర్టు శ్రీనివాస్‌కు ఈనెల 23వరకు రిమాండ్ విధించింది. అనంతరం శ్రీనివాస్‌ను పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు.

పొలంలో కుప్పకూలిన రైతు

ఇల్లందకుంట: మండలంలోని మర్రివానిపల్లిలో పొలంలో పని చేస్తుండగా ఓ రైతు గుండెపోటుతో కుప్పకూలాడు. గ్రామానికి చెందిన కనుకుల నరసింహారెడ్డి(70) గురువారం తన వ్యవసాయ బావి వద్ద పొలంపనులు చేస్తున్నాడు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమీప రైతులు గమనించేలోపే మృతి చెందాడు. మృతుడికి భార్య సరోజన, కొడుకు, కూతురు ఉన్నారు.